పనివాడు బయటకి వెళ్ళి ఓ వ్యక్తిని లోపలికి పంపించాడు. ఆయన ఎవరో కాదు. నటరాజన్.

బుచ్చిబాబు పనిచేసే ఆఫీసు హైదరాబాద్‌లోని హెడ్డాఫీసు సీనియర్ ఎగ్జిక్యూటివ్!

“వణక్కం” అన్నాడు నటరాజన్ మినిస్టర్ మిన్నారావ్ వంక చూసి చేతులు జోడిస్తూ.

“గిణక్కం! హి హి హి......ఇది మా బాస! కూకో సామీ కూకో! సూత్తె పెద్దమడిసిలా వున్నావు” అన్నాడు మిన్నారావు.

“నాను ఏం పెద్దమడిసి..... తమరుదా దొడ్డమనిషి!” అంటూ అతని ఎదురుగా సోఫాలో కూర్చున్నాడు నటరాజన్.

“సరే....తమరెవరు? ఏం పనిమీద వచ్చారు? ఏమైనా ఓపెనింగ్సా?” సంబరంగా అడిగాడు మినిస్టర్ మిన్నారావ్ .

“నాన్‌దా నటరాజన్”

తనపేరు చెప్పుకుని తను ఎక్కడ పని చేసేదీ చెప్పాడు నటరాజన్.

“ఓ....అయితే మీ అఫీసును కొత్త బిల్డింగ్‌లోకి షిఫ్టింగ్స్ సేస్తావుంటే దాన్ని ఓపెనింగ్స్ సేయ్యడానికి  నన్ను పిలుస్తా వుండారు అవునా?” కులాసాగా అడిగాడు మినిస్టర్ మిన్నారావ్ .

నటరాజన్ మిన్నారావు అన్నదానికి సమాధానం చెప్పకుండ మొహం చిట్లిస్తూ ముక్కు మూస్కున్నాడు.

అది చూసి మినిస్టర్ మిన్నారావ్  మొహం చిట్లించాడు.

“ఏందయ్యోవ్.....నేను మాట్లాడ్తా వుంటే ముక్కు మూస్కుంటావుండవ్. అంత కంపు కొట్టడనికి నేనేమయినా పళ్ళు తోముకోని పాచీ పళ్ళవాడిననుకున్నావా? నేను క్లోజప్ టూత్‌పేస్ట్‌తో పళ్ళను రుద్ది రుద్ది తోముకుంటా. కావాలంటే నామొహంమీద మొహమెట్టు.....హా....హా, అంటా! నీకే తెలుసుద్ది.”

నటరాజన్ చెంపలు వాయించుకున్నాడు.

“హయ్యో హయ్యో! లేదప్పా నీది నోరు కంపు అని నాన్‌దా ఎట్లు సొల్లుదును? ఇక్కడ ఎలక సచ్చిన వాసన వాసన మాదిరి వస్తా వుండాది........ ఏంది మురుగా అని అలోసిస్తా వుంటివి?”

మినిస్టర్ మిన్నారావ్ పకపకా నవ్వాడు.

“మీరు భలే వారండీ బాబూ! అది ఎలక సచ్చిన వాసన కాదు. మాయావిడ ఉప్పుసేపల కూర సేత్తావుంది. ఈ కమ్మటి వాసన దాందే. అ కూరంటే నాకేంతో ఇష్టం!” లొట్టలు వేసాడు మినిస్టర్ మిన్నారావ్ .

“హా! మురుగా!” మనసులోనే అనుకున్నాడు నటరాజన్.

“ఇంతకీ తమరొచ్చిన పని గురించే సెప్పలేదు....ఓపెనింగ్సే కదూ?” అడిగాడు మిన్నారావు.

"ఓపెనింగ్స్ ఇల్లే" అన్నాడు నటరాజన్.

"ఓహో ఇంటిని ఓపెనింగ్స్ చెయ్యాలా! అట్టాగే....... దాందేముంది?" సంతోషంగా అన్నాడు మిన్నారావు.

"ఇల్లే....ఇల్లే...ఓపెనింగ్ ఇల్లే అంటే లేదు....ఓపెనింగ్ లేదు అనిదా" కంగారుగా అన్నాదు నటరాజన్.

"మరి?"

"నానుదా డిప్యూటీ జనరల్ మేనేజర్ పోస్టులోదా వుంటివి! నాకు జనరల్ మేనేజర్ పోస్టుకు ప్రమోషన్ కావలెను"

"చాల్చాల్లేవయ్యా.....లెగుజనరల్ మేనేజర్ పోస్టేమైనా నాజేబులో ఉందనుకున్నావా?" విసుగ్గా అన్నాడు మిన్నారావు.

"అమా....తమరి జేబులోదా ఇరికి!" అన్నాడు నటరాజన్.

"ఎలా ఇరికి?" పళ్ళు కొరుకుతూ అడిగాడు మిన్నారావు.

"సెప్తును.....సెప్తును"

నటరాజన్ తన చేతిలోని హ్యాండ్‌బ్యాగ్ తెరచి అందులోంచి పాత న్యూస్‌పేపర్ ఒకదాన్ని తీసి "ఇది సూడప్పా!" అన్నాడు.

మినిస్టర్ మిన్నారావ్ గుండెలు దడదడలాడాయ్.

"ఏందది?" అడిగాడు.

"సూడప్పా...నీకే తెలియును"

మినిస్టర్ మిన్నారావ్ ఆ న్యూస్ పేపర్‌ని అందుకున్నాడు. దాన్ని చూడకుండానే అర్థమయిపోయింది అది రాజేంద్ర హత్యకి సంబదించిన వార్త పడిన న్యూస్‌పేపర్ అని.

"కెవ్వ్వ్!"

గట్టిగా అరిచాడు మినిస్టర్ మిన్నారావ్ !

* * *

బుచ్చిబాబు తెచ్చిన ఫైల్ చూసి "వెరీగుడ్! నువ్వింకా వెళ్ళొచ్చయ్యా బుచ్చిబాబు ! సరేగానీ నువ్వు మరీ అతిగా కష్టపడిపోకు. ఈ ఆఫీసులో కిల్లారికిత్తిగాళ్ళు ఇంకా చాలామంది ఉన్నారుగా! వాళ్లకి నీపని కూడా నేను అప్పగిస్తాలే" అన్నాడు ఏకాంబరం .

"అలాగే సార్" బుద్దిగా తల ఉపాడు బుచ్చిబాబు .

"నేనింకా వెళ్ళనా సార్?"

"వెళ్ళమనే కదా చెప్పా! అవునయ్యోవ్ ఓముఖ్య మైన విషయం మర్చిపోయా....నీకు తెలిసిన మంచి క్యాండిడేట్ ఎవరయినా వున్నారా?"

"దేనికి సార్?"

“వేరే సెక్షన్స్‌లో కాస్త స్టాఫ్ అవసరం పడింది. టెంపరరీగా రిక్రూట్ చేస్కుందామనీ.....”

“ఉన్నారు సార్....” చటుక్కున అనేశాడు బుచ్చిబాబు సీత దృష్టిలో వుంచుకుని.

సీత ఉదయం ఇలా అడిగేసరికి సాయంత్రం ఉద్యోగం అలా కాళ్ళ దగ్గరికి వచ్చేసరికి బుచ్చిబాబు చాలా థ్రిల్లింగ్‌గా ఫీలయ్యాడు.

“ఎవరూ....ఏంటి కథ? క్యాండిడేట్ కిల్లారికిత్తి అయితే లాభం లేదు......మంచి డింగాలడిప్పి అయి వుండాలి!”

బుచ్చిబాబు అంతలోనే ఆలోచనలో పడిపోయాడు.

సీత గురించి చెప్తే ఆమె ఎవరూ? నీకేమవుతుందీ? అంటూ ప్రశ్నలేసి చంపుతాడు.

“ఏంటీ ఆలోచిస్తున్నావ్? క్యాండిడేట్ పచ్చి కిల్లారికిత్తా?” అనుమానంగా చూస్తూ అడిగాడు ఏకాంబరం.

“కాద్సార్......మాంచి డింగాలడిప్పే!”

“మరెందుకు అలస్యం?”

“అంటే....ఆ క్యాండిడేటేమో ప్రస్తుతం అండమాన్ దీవుల్లో వున్నాడు సార్”

“ఎందుకూ?”

“ఏమో సార్! సిల్లీగా అక్కడికెళ్ళి వున్నాడు సార్. పోనీ పిలిపిద్దామంటే వాడి అడ్రెస్ కూడా నాదగ్గర లేద్సార్”.

“ఓ........” బాధగా జుట్టు పీక్కున్నాడు ఏకాంబరం . “నువ్వు డింగాల డిప్పిలా కాకుండా డప్పాల డిప్పిలా మాట్లాడితే ఎలానోయ్? క్యాండిడేట్ వున్నాడ అంటే అందుబాటులో వున్న క్యాండిడెట్ గురించి చెప్తే ఎలానోయ్.......సర్లే.....వేరే మంచి క్యాండిడేట్ వుంటే చెప్పు.....నీ క్యాండిడెట్‌కే ఉద్యోగం ఇచ్చేస్తా!”

“అలాగే సార్” అని క్యాబిన్ బయటకి వచ్చేసాడు.

అప్పుడు అఫీసు టైం కూడా అయిపోయింది. అప్పటికే సెక్షన్‌లోని వాళ్ళంతా వెళ్ళిపోయారు.

బుచ్చిబాబు కూడా టేబుల్ సొరుగు సర్దుకుని అఫీసు బయటకొచ్చేసాడు.

బస్సుస్టాండు వైపు ఆడుగులు వేస్తుండగా తని ప్రక్కన స్కూటర్ అగింది.

బుచ్చిబాబు తల ప్రక్కకి తిప్పి చూశాడు.

నవీన్!పక్క సెక్షన్‌లో వుంటాడు.

“హలో......బాగున్నారా?” చిరునవ్వుతో పలకరించాడు నవీన్.

“బాగానే వున్నాను. థాంక్యూ” అన్నాడు బుచ్చిబాబు .

“ఎటు వెళ్తున్నారు?” అడిగాడు నవీన్.

“లబ్బీపేట!” చెప్పాడు బుచ్చిబాబు .

“ఓ రండీ...... నేను కూడ అటె వెళ్తున్నా....మిమ్మల్ని డ్రాఫ్‌చేస్తాను.”

బుచ్చిబాబు స్కూటర్ వెనకాల కూర్చున్నాడు. నవీన్ స్కూటర్‌ని ముందుకు పరిగెత్తించాడు.

అయిదు నిముషాల్లో లబ్బీపేట వచ్చేసింది.

"ఇక్కడ ఆపండి" అన్నాడు బుచ్చిబాబు .

"మీ ఇల్లు ఎక్కడ?" స్కూటర్ అపుతూ అడిగాడు నవీన్.

"ఇదిగో....ఈ సందులోంచి కాస్త ముందుకెళ్తే వస్తుంది"

"మరి ఇక్కడే అపమన్నారేం? ఇంటి దగ్గర అపుజేస్తాలెండి!"

బుచ్చిబాబు వద్దు వద్దని అంటున్నా నవీన్ స్కూటర్‌ని సందులోకి తిప్పాడు.

"ఇదేమా ఇల్లు" సందు చివరకి వెళ్ళాక చెప్పాడు బుచ్చిబాబు .

నవీన్ స్కూటర్ అపాడు. బుచ్చిబాబు క్రిందకి దిగాడు.

ఇప్పుడు బుచ్చిబాబు గొప్ప ఇరకాటంలో పడిపోయాడు.

పాపం .......స్కూటర్ మీద ఇంటిదాకా తీసుకొచ్చినందుకు థాంక్స్ చెప్తే సరిపోదు. లోపలికి రమ్మనడం కనీస మర్యాద కానీ లోపలికి రమ్మంటే లోపల సీతని చూస్తాడు.

సీతని ఏమని పరిచయం చేయాలి?

"ఏంటందీ అలోచిస్తున్నారు?" అడిగాడు నవీన్.

"హబ్బే....ఏంలేదు! థాంక్సండీ నవిన్‌గారూ. శ్రమ తీస్కుని ఇంటిదాకా డ్రాప్ చేసారు. మిమ్మల్ని ఇంట్లోకి ఇన్‌వైట్ చెయ్యాలని వుందిగానీ ఈ టైమ్లో మిమ్మల్ని లోపలికి రమ్మంటే సిల్లీగా వుంటుంది. అసలే అఫీసులో చాలా అలసిపోయి ఎప్పుడెప్పుడు ఇంటికెళ్దామా అనేదీంట్లో వుంటారు. దానికితోడు మీ టైం వేస్టుచేసినట్టు కూడ వుంటుందేమో!హి హి హి " ఇబ్బందిగా నవ్వుతూ అన్నాడు బుచ్చిబాబు.

"భలేవారే సార్. అఫీసులో ఏం పాటుపడి పోతున్నామని అలసిపోతాం. ఇకపోతే టైం వేస్టంటారా....మీతో గడపడమ ఇటిజ్ ఎప్లెజర్ టైం వేస్టు ఎందుకవుతుంది సార్?"

తనతో గడపడం అతనికెందుకు ప్లెజరో అర్థంకాక బుచ్చిబాబు లోలోపల గింజుకున్నాడు. ఇంక అతన్ని లోపలికి రమ్మనక తప్పదు!

"హి!హి హి....అయితే రండి.....కాస్సేపు కూర్చుని వెళ్లురుగానీ " అన్నాడు బుచ్చిబాబు అనవసరంగా అతని స్కూటర్ ఎక్కినందుకు బాధపడ్తూ.

నవీన్ స్కూటర్‌కి స్టాండ్‌వేసి లాక్‌చేసి బుచ్చిబాబుని అనుసరించాడు.

*　　　　　*　　　　　*

బుచ్చిబాబు డోర్ బెల్ నొక్కాడు గుండె బరువుగా కొట్టుకుంటుండగా.

నాలుగు సెకన్లలో తలుపులు తెరుచుకున్నాయి.

"ఓ వచ్చేసావా?" అంటూ ఏదో అనబోయిన సీత నవీన్‌ని చూసి అగిపోయింది.

"రండి" అన్నాడు బుచ్చిబాబు నవీన్‌తో

సీత ప్రక్కకి తప్పుకుంది.

ఇద్దరూ లోపలికి వెళ్ళారు.

“ఈయన మా అఫీసులో పనిచేస్తారు....నవీన్”...... సీత !!”

పరిచయం చేసాడు బుచ్చిబాబు .

ఇద్దరూ నమస్కారాలుచేసుకున్నారు.

వాళ్ళకి ఏకాంతం కల్పిస్తూ సీత లోపలికి వెళ్ళిపోయింది.

బుచ్చిబాబు గండం గడిచిందని తేలిగ్గ ఉపిరి పీల్చుకున్నాడు.

ఇద్దరూ హాల్లో సోఫాల్లో కూర్చుని వాళ్ళ వాళ్ళ సెక్షన్ కబుర్లు చెప్పుకోసాగారు.

ఇంతలో సీత మళ్ళీ వచ్చింది చేతిలో ట్రేలో మూడు కాఫీలు కప్పుల్తో.

ఇద్దరూ కప్పు అందుకున్నారు. ట్రేలోని మూడో కప్పు అందుకుని సీత అక్కాదే కూర్చుంది వారిద్దరికీ ఎదురుగా. బుచ్చిబాబుకి గోంతులో పచ్చి వెలక్కాయ పడింది.

నవీన్ కాఫీ సిప్ చేసి “ఓహ్.......!వాటే నైస్ కాఫీ! చాలా బాగుందండీ!” అన్నాడు సీతతో.

“థాంక్యూ ఫర్ ది కాంప్లిమెంట్!” అంది సీత .

“మీరు చాలా అదృష్టవంతులండీ బుచ్చిబాబుగారూ! కాఫీయే ఇంత అద్భుతంగా చేస్తే మీ శ్రీమతిగారు వంటెంత అద్భుతంగా చేస్తారో!” అన్నాడు బుచ్చిబాబుతో.

వెంటనే సీత అందుకుని అంది.

“మీరు పోరపాటుపడ్తున్నారండీ నవీన్‌గారూ! నేను అయన భర్యని కాదు. స్నేహితురాల్ని మేం కలసి జీవిస్తున్నాం.... అంతే!”

బుచ్చిబాబు చేతిలోని కప్పు జారి కిందపడిపోయింది.

0 0 0

రాత్రి....

బెడ్‌రూంలో లైటార్పి బుచ్చిబాబు సీత ప్రక్కన పడుకున్నాడు.

“పనంతా అయిపోయిందా?” అడిగింది సీత .

“వంటిల్లు సర్దాను. కానీ అంట్లుతోమలేదు. ఓపికలేదు. సింక్‌లో పడేసాను. రేపు పోద్దున్న తోముకుంటా” అన్నాడు బుచ్చిబాబు చికాకుని అణుచుకుంటూ.

సీత నవ్వింది.

“ఏంటి......మూడ్రోజులకే ఓపిక పోయిందా?”

“నువ్వు సిల్లీగా నవ్వకు! అఫీసులో పనిచేసి మళ్ళీ ఇంట్లో ఈ పనులన్నీ చెయ్యాలంటే యెంత కష్టం? ఓపిక వుండొద్దూ?”

సీత మళ్లీ నవ్వింది!

“ఓహో అలాగా! మరి ఆఫీసులో ఉద్యోగము చేస్తూ ఇంటిలో అన్ని పనులూ చేసే వేలాది మంది ఉద్యోగినుల మాటో? నీకైనా సగం రోజులు నేను చేస్తానని అంటున్నాను. వాళ్ళయితే జీవితాంతమ ఇంట్లో, ఆఫీసులో బాధ్యతలతో నలిగిపోవాలే! సొంతంగా అనుభవిస్తేగానీ మీ మగాళ్ళకి తెలీదు అ కష్టం ఏమిటో....పాపం! నీకు మూడు రోజులకే విరక్తిపుట్టేసినట్టుంది.

బుచ్చిబాబు ఏం సమాధానమ చెప్పలేదు. మౌనంగా ఉండిపోయాడు.

సీత నవీన్‌తో హఠాత్తుగా  తాము భార్యాభర్తలంకామనీ. స్నేహితులమనీ, కలసి జీవిస్తున్నామనీ చెప్పేసరికి బుచ్చిబాబు ఖంగుతిన్నాడు. ఆ షాక్ నుండి అతను పూర్తిగా తేరుకోలేదు. అతని మెదడంతా మొద్దుబారి పోయింది. అసలే మైండంతా కంగాళీగా ఉంటే ఈ అంట్లు తోముకునే టాపిక్ ఒకటి అనుకున్నాడు.

“ఏంటి? కోపం వచ్చిందా?ఉన్నమాటేగా అన్నాను?” ప్రక్కకి తిరిగి బుచ్చిబాబు గుండెల మీద చెయ్యేస్తూ అంది సీత .

వాళ్ళిద్ధరి మధ్య ఆ రిలేషన్ ఏర్పడే సరికి సీతకి బుచ్చిబాబంటే మరింత ప్రేమ, దగ్గరతనం ఏర్పడింది.

“ఊహూ... ఊహూ...కోపం ఎందుకు సిల్లీగా?” అన్నాడు చేతి మీద తన చేతిని వేస్తూ.

అంతలోనే సీతకి రాధ మాటలు గుర్తుకు వచ్చాయి. వెంటనే తన చేతిని అతని చేతి క్రింది నుండి వెనక్కు లాగేసుకుంది.

ప్రేమా దోమ ఆంటూ నువ్వూరికే కరిగిపోకు....  జాగ్రత్త! అంది రాధ ఊరికెళ్ళే ముందు సీతతో.

“నువ్వు డల్‌గా వున్నావేం మరి?” అడిగింది సీత.

బుచ్చిబాబు ఏమీ సమాధానం చెప్పలేదు.

“నేను నవీన్‌తో అల చెప్పాననా?” మళ్ళీ తనే అడిగింది.

దానికి మౌనంగా ఉన్నాడు బుచ్చిబాబు .

సీతకి అర్ధమయింది బుచ్చిబాబు అందుకే అప్‌సెట్ అయ్యాడని.

“మరేం చెయ్యను చెప్పు. నీకేమో నిజాన్ని చెప్పే ధైర్యం లేదు. కనీసం నేనైనా చెప్దామనీ...” అంది.